క్లుప్తంగా

నియామకం



నియామకపత్రాన్ని అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ముషీరాబాద్: బీసీ విద్యార్థి సంఘం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా పెండెం వంశీయాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్‌లు సంఘం కార్యాలయంలో ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళాబిల్లు తరహాలో బీసీబిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి మెజార్టీ వర్గాలైన బీసీలకు ఆయా రంగాల్లో తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు ఉద్యమిస్తానని వంశీయాదవ్ తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేట డివిజన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌నగర్ బస్తీకి నూతన కమిటీ ఎన్నికైంది. శనివారం బస్తీలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోగా.. అధ్యక్షులుగా కోటం అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ప్రేమ్‌కుమార్, నూనె విజయకుమార్ ప్రధాన కార్యదర్శిగా నిమ్మగడ్డ శ్రవణ్‌కుమార్, కోశాధికారిగా రావులు ప్రదీప్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. బస్తీపెద్దలు బాలరాజ్, కుంకుమ బాలరామ్, కృష్ణయ్య, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్జీమర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీడీసీఓపీ, డీడీసీఓఎన్ విద్యార్థులు

నల్లకుంట: మతి మరపు కంటే అతి భయంకరమైనది అల్జీమర్ వ్యాధి అని క్షేత్ర ఫౌండేషన్ ఫౌండర్ పవిత్రాగంగాధరన్ అన్నారు. అల్జీమర్స్ డెమెన్షియా ఇండియా అలయెన్స్, హెరిటేజ్ ఫౌండేషన్ హైదరాబాద్ రీజియన్, రీజనల్ రీసోర్స్ ట్రైనింగ్ అండ్ మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎన్‌పవర్మెంట్ సంయుక్తాధ్వర్యంలో శనివారం నల్లకుంట డీడీహెచ్ ఆసుపత్రి నుంచి విద్యానగర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ గురజాడ శోభ పెరిందేవితో కలిసి ఆమె ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. వృద్ధుల్లో చాలామంది అల్జీమర్ వ్యాధిభారిన పడుతున్నారన్నారు. 2036 కల్లా 1.7 కోట్ల మంది ఈ వ్యాధి భారినపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యువతీయువకులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

గీత కార్మికుల హామీలను నెరవేర్చాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం వివిధ సందర్భాల్లో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులంతా తరలివచ్చి ఇందిరాపార్కు వద్ద తమ నిరసన వ్యక్తం చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తరలివచ్చిన గీతా కార్మికులు తమ ఆవేదన వెలిబుచ్చారన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.30 కోట్లు వెంటనే విడుదల చేయాలని, వృత్తిలో ప్రమాద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సేఫ్టీ మోకులు ఇవ్వాలని, మునుగోడు ఉపఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని, కుల వృత్తులకు ఇస్తామన్న ఆర్థికసాయాన్ని నెరవేర్చాలని గీతన్న బీమాను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

యూజీసీ ఎరియర్స్ మంజూరుపై హర్షం

గాంధీఆస్పత్రి : గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న యూజీసీ ఎరియర్స్ చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేస్తూ జీవో జారీ చేయడంపై టీజీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ భూపేందర్ రాథోడ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ 2016 జనవరి నుంచి 2020 ఆగస్టు వరకు యూజీసీ బకాయిలను మంజూరు చేస్తూ శనివారం సాయంత్రం సంబంధిత ఫైల్‌పై సంతకం చేయడంతో టీజీజీడీఏ ప్రధాన డిమాండ్ నెరవేరిందన్నారు. సీఎం కేసీఆర్ ఆశయమైన ఆరోగ్య తెలంగాణ సాధనలో ప్రభుత్వ వైద్యులు, సంఘం తమ వంతు కృషి చేసిందని, ప్రభుత్వ వైద్యుల న్యాయమైన డిమాండ్లు, సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూజీసీ ఎరియర్స్ మంజూరు చేసిన సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావు, వైద్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి రి జ్వీ, డీఎంఈ రమేష్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.

‘నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం’

- పరీక్షను రద్దు చేసిన హైకోర్టు
- ఆందోళన చెందుతున్న అభ్యర్థులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విపక్ష నేతలు

ముషీరాబాద్: గ్రూప్–1 పరీక్ష రాసిన అభ్యర్థులు దాని కీ కూడా విడుదల కావడంతో ఎంతో మంది నిరుద్యోగ యువకులు ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూసిన అభ్యర్థులకు హైకోర్టు నుంచి పిడుగు లాంటి వార్త వినపడింది. మొదటిసారి గ్రూప్–1 పరీక్షా పేపర్ లీకైనా కారణంగా ఆ పరీక్షను రద్దు చేసి జూన్ 11న రెండోసారి గ్రూప్–1 పరీక్షను నిర్వహించగా.. బయోమెట్రిక్ తీసుకోలేదనే కారణంగా కొంతమంది అభ్యర్థులు కోర్టు మెట్లు ఎక్కగా రెండోసారి నిర్వహించిన పరీక్షను కూడా రద్దు చేయడం నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి ఉద్యోగాల భర్తీ విషయంలో సరైన విధానం అవలంభించడం లేదని నిరుద్యోగ అభ్యర్థులు వాపోతున్నారు.

- గాంధీనగర్, ఆశోక్‌నగర్, ఆర్టీసీక్రాస్ రోడ్స్ చిక్కడపల్లి, దోమలగూడ, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో తెలంగాణరాష్ట్రంలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చిన నిరుపేద, నిరుద్యోగ అభ్యర్థులు ఏళ్ల పాటు ఉన్న ఊరును, తల్లిదండ్రులను వదిలి వేలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ సెంటర్లల్లో తర్ఫీదు పొంది నోటిఫికేషన్‌లు ఎప్పుడు వేస్తారో అని కళ్లు కాయలు కాచేలా వేచి చూసిన నిరుద్యోగ అభ్యర్థులు చివరకు రెండుసార్లు పరీక్షలు రాస్తే రెండుసార్లు పరీక్షలను రద్దు చేయడంతో అభ్యర్థులు మనోవేదన చెందుతున్నారు.

కాచిగూడ: సీఎం కేసీఆర్ ప్రభుత్వ అసమర్థ ప్రజాపాలన, సరైన నిర్ణయాలు తీసుకోవడంలో వైఫల్యం కారణంగా వరుసగా రెండోసారి రాష్ట్రంలో గ్రూపు –1 ప్రిలిమినరీ పరీక్షలు రద్దుకావడం ప్రభుత్వం, టీఎస్‌పీఎస్‌సీ చేతగానితనానికి నిదర్శనమని బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి కె.ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న 4లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను అన్యాయం చేసిందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ను వెంటనే తొలగించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

టీఎస్‌పీఎస్‌సీ నీ వెంటనే రద్దు చేయాలి..

కాచిగూడ: లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న టీఎస్‌పీఎస్‌సీని వెంటనే రద్దు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. శనివారం బర్కత్‌పురలోని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి పరీక్ష విద్యార్థులకు రూ.3లక్షలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. పరీక్షల్లో ఇప్పటి వరకు జరిగిన అవకతవకలపై జూడిషియల్ ఎంక్వైరీ చేసి దోషుల్ని శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే డీఎస్‌పీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి పరీక్షలు నిర్వహించడం చేతకాదు



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరుద్యోగ యువత తమకు ఉద్యోగాలు వస్తాయని ఎంతో ఆశతో ఉన్నారు. కానీ నోటిఫికేషన్లు ఇవ్వడమే అంతంత మాత్రం అయితే పరీక్షలు నిర్వహించడం కూడా ఈ ప్రభుత్వానికి చేత కావడం లేదు. గ్రూప్–1 పరీక్ష గతంలో పేపర్ లీకేజీ వల్ల రద్దు కాగా.. మరోసారి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల హైకోర్టు రద్దు చేసింది.

–సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు

టీఎస్‌పీఎస్‌ఈ చైర్మన్‌ను తొలగించాలి



గ్రూప్–1 పరీక్ష రెండోసారి రద్దు కావడం, పేపర్ లీకేజీపై ప్రభుత్వం రివ్యూ కూడా చేయకపోవడంతోనే ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా బయోమెట్రిక్ తీసుకోకుండా పరీక్ష నిర్వహించారు. దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంతో పాటు టీఎస్‌పీఎస్‌ఈ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తొలగించి బోర్డును ప్రక్షాళన చేయాలి. నిరుద్యోగ యవతకు న్యాయం చేయాలి.

–పి.మహేష్, పీడీఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు

కేసీఆర్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం



కేసీఆర్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల కపట ప్రేమను ప్రదర్శిస్తోంది. గతంలో పేపర్ లీకేజీపై విద్యార్థులు, నిరుద్యోగులు పెద్దఎత్తున ఉద్యమించిన ప్రభుత్వంలో స్పందన లేదు. కనీసం పరీక్షలు నిర్వహించడం కూడా చేతకావడం లేదు. ప్రభుత్వం వెంటనే బోర్డును ప్రక్షాళన చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలి.– ఆజాద్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం



కమ్యూనిటీహాల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్: అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్ పరిధిలోని కోట బస్తీలో రూ. కోటి 10లక్షల బడ్జెట్‌తో నిర్మించనున్న కమ్యూనిటీహల్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక భవనాలు (కమ్యూనిటీ హాల్స్) పేద ప్రజలకు వరంలాంటివని, వారి అవసరాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు సహకారం అందించాలన్నారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యామ్‌యాదవ్, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, అంజయ్యగౌడ్, సురేష్, రవి, శివ, వెంకటేష్, మాధవి, నరేష్, బాబాచారి, అనిల్‌గౌడ్, జహంగీర్, నర్సింహ, ప్రమోద్, చిన్న తదితరులున్నారు.

శబరిమల సమాచార కేంద్రం పోస్టర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆనందగోపాలన్

కాచిగూడ: రాష్ట్రం నుంచి ప్రతి ఏటా శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం నగరంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు శబరిమల సమాచార కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు టీడీబీ అధ్యక్షుడు అడ్వకేట్ ఆనంద గోపాలన్ తెలిపారు. అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలోని దియా స్వాగత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు శబరిమల సమాచార కేంద్రం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సమాచార కేంద్రం ద్వారా శబరిమలకు వెళ్లే ప్రతి భక్తుడు తమకు అవసరమైన సమాచారం తెలుసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005719984ను ఆయన ప్రారంభించారు. టీడీబీ కార్యదర్శి బిజ్జు, శబరిమల మాజీ మేల్ శాంతి సుధీర్ నంబూద్రి, అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీనివాస్, కళ్యాణ్ చక్రవర్తి, విఘ్నేష్, శ్రీనివాస్, రాజేందర్‌గౌడ్, రాజుగౌడ్ గురుస్వామి, పింజరి నర్సింగ్‌రావు గురుస్వామి, దూసరి వెంకటేష్ గురుస్వామి ఉన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి



పోస్టర్‌ను ఆటోకి అంటిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో పేదల అభ్యున్నతికి పాటు పడుతున్నానని, వచ్చే ఎన్నికల్లో తనకు అండగా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బీఆర్‌టీయూసీ ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా ఆటోలకు పోస్టర్లను అంటించే కార్యక్రమం శనివారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, పద్మతో పాటు బి.వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్మిక నాయకులు పూలిజాల గెల్వయ్యతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆటో యూనియన్ నాయకులు రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించి వారిని అభినందించారు. ఎలాంటి ఇబ్బందులున్న నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆటో యూనియన్ నాయకులు పోలే నిరంజన్, రామకృష్ణ, శివకుమార్ గుప్తా, హరి, రామస్వామి, శంకర్ కుమార్ తదితరులున్నారు.

రోడ్ల సమగ్రాభివృద్ధికి కృషి

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్ న్యూ పటేల్‌నగర్ రూ.32 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బస్తీలు, కాలనీల్లో రోడ్లను పెద్దఎత్తున అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గంలో దశాబ్దాల కాలం నాటి సమస్యలను దశలవారీగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఆగిన రోడ్డు పనులు.. ప్రజల ఎదురుచూపులు



మూసాకేఫ్ వద్ద ఆగిపోయిన రోడ్డు పనులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నల్లకుంట కూరగాయల మార్కెట్‌లోని హెరిటేజ్ నుంచి శ్రీరామ్‌నగర్ బస్తీ వరకు వేయనున్న రోడ్డు పనులు అర్థాంతరంగా మూసాకేఫ్ వద్ద ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండేళ్లుగా రోడ్డు పనులు కొనసాగుతూ మధ్యలోనే ఆగిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి ఆ మట్టిరోడ్డు అంతా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌లకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు, అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మార్క్స్–అంబేద్కర్ మన మార్గదర్శకులు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: లాల్ నీల్ మైత్రి వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మార్క్స్–అంబేద్కర్‌లు మన మార్గదర్శకులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ కుల వివక్షతకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులే కాకుండా ప్రజావాదులందరు ఏకం కావాలన్నారు. అణచివేత, దోపిడీ వ్యవస్థలు నేటికి కొనసాగుతున్నాయని వాటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్రముఖ అంబేద్కరిస్టు జె.బి.రాజు మాట్లాడుతూ అంబేద్కర్ చేసిన పోరాటం, సిద్ధాంతం, త్యాగాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. మార్క్స్–అంబేద్కర్‌లు కలిపిన సిద్ధాంతాలే ప్రజలను విముక్తి చేస్తాయన్నారు. శ్రామికవర్గ పోరాటానికి కులం అడ్డుగా ఉందని అంబేద్కర్ కమ్యూనిస్టులను హెచ్చరించారని గుర్తు చేశారు. లాల్ నీల్ మైత్రి వేదిక ప్రతినిధులు బొజ్జ భిక్షమయ్య, నల్లా సూర్యప్రకాష్, వనం సుధాకర్ పాల్గొన్నారు.

స్పా మసాజ్ సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

12 మంది అరెస్ట్

చిక్కడపల్లి: అక్రమంగా నిర్వహిస్తున్న స్పా మసాజ్ సెంటర్‌పై సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మొత్తం 12 మందిని పోలీసులు పట్టుకున్నారు. వారిలో ముగ్గురు నిర్వాహకులు, 5 కస్టమర్లు ఉన్నారు. 4 మహిళా కార్మికులు ఉన్నారు. స్పా పేరిట వీళ్లు క్రాస్ మసాజ్ (లైంగిక కార్యకలపాలు) నిర్వహిస్తున్న వీరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు దోమలగూడ పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ బహదూర్‌పురాకు చెందిన బండి అనిల్‌కుమార్ (36) హిమాయత్‌నగర్‌లో యంత్ర పేరుతో స్పా మసాజ్ సెంటర్ నెలకొల్పి నిర్వహిస్తున్నాడు. ఈ సెంటర్‌లో మేనేజర్‌గా కిషన్ సింగ్ హజారీ(36) పనిచేస్తున్నాడు. బోరబండకు చెందిన దుర్గాప్రసాద్ (28) రిసెప్షనిస్టుగా, అజ్మత్ అలీ అన్సారీ, కృష్ణకుమార్, అజయ్‌సింగ్, ఎల్. రాంనాథన్, ప్రియేష్ చందులు పనిచేస్తున్నారు. బండి అనిల్‌కుమార్, కిషన్‌సింగ్ హజారీలు ప్రధాన సూత్రధారులు. కాగా నలుగురు మహిళలను యాంగేజ్ చేసుకొని పురుష కస్టమర్లను మసాజ్ పేరిట ఆకర్షిస్తూ.. చట్ట విరుద్ధంగా పనిచేయడం మొదలుపెట్టారు. సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో శుక్రవారం రాత్రి స్పా సెంటర్‌పై దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు మహిళలను సంరక్షించి స్పా నిర్వాహకులను కూడా అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం దోమలగూడ పోలీసులకు అప్పగించారు. వారు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

2న వంజరి కులస్తుల సర్వసభ్య సమావేశం

లాలాపేట: తెలంగాణ వంజరి సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 2న తార్నాకలోని వంజరి భవన్‌లో వంజరి కులస్తుల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు. శనివారం తార్నాకలోని వంజరి సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో సర్వసభ్య సమావేశం ఎజెండా, సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, రానున్న రోజుల్లో చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వంజరి సంఘం అభివృద్ధికి ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో కాలేరు నరేందర్, కందారి వెంకటేశం, కాలేరు అమరేందర్, సాల్వేరు ముత్తయ్య, రాజు, ప్రవీణ్, సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ‘సత్యశోదక్ సమాజ్’ వార్షికోత్సవం



సత్యశోదక్ సమాజ్ సదస్సులో అభివాదం చేస్తున్న వామన్‌మెశ్రం తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశం మూలవాసులకు దిక్సూచి సత్యశోదక్ సమాజ్ అని భారత్ ముక్తి మోర్చా జాతీయ అధ్యక్షుడు వామన్‌మెశ్రం అన్నారు. అసలైన సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం సత్యశోదక్ సమాజ్ ద్వారానే సాధ్యమైందన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సత్యశోదక్ సమాజ్ 150వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వామన్‌మెశ్రం మాట్లాడుతూ.. మహాత్మజ్యోతిరావుపూలే, సావిత్రీబాయి పూలే దంపతులు ప్రారంభించిన సత్యశోదక్ సమాజ్ ఆవిర్భవించి నేటికి 150 ఏళ్లు పూర్తైందన్నారు. దేశంలో మొట్టమొదట బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు విద్యను అందించడానికి పెద్దఎత్తున ఉద్యమం నడిపారని, ఈ ఉద్యమ చైతన్యాన్ని సంస్థాగత నిర్మాణంలోకి తీసుకురావాడానికి సత్యశోదక్ సమాజ్ సంస్థను ప్రారంభించామన్నారు. సత్యశోదక్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు బట్టి చెన్నయ్య మాట్లాడుతూ.. సత్యశోదక్ సమాజ్ ద్వారా ఆదర్శ వివాహాలు, నామకరణ మహోత్సవాలు, సంఘ సంస్కరణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అంబేడ్కర్ యువజన సంఘాల వ్యవస్థాపకులు జే.బీ.రాజు, సత్యశోదక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్ బట్టు, ప్రజాకవి జయరాజ్, మాస్టర్‌జీ, బాల శ్రీనివాస్ పటేల్, సాగర్ ఏకలవ్య, దాసురామ్ నాయక్, బాంసెఫ్ జాతీయ కార్యదర్శి కుమార్, ఆర్‌కేఎం అధ్యక్షుడు మల్లన్న, రవితేజ, ధనలక్ష్మి, విఠల్, రాహుల్ తదితరులున్నారు.

రైలు ఢీకొని పెయింటర్ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని పెయింటర్ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన కె.శంకర్ (52) పెయింటర్. శనివారం యాకత్‌పుర, ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో డ్రైవర్ మృతి..

కాచిగూడ: అనారోగ్యంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన వడ్డె సురేష్ (26) వాటర్ ప్లాంట్‌లో డ్రైవర్‌గా పనిచేసేవాడు. గత కొద్ది రోజులుగా మద్యానికి బానిసై అనారోగ్యంతో పలు దవాఖానాల్లో చికిత్స పొందాడు. పరిస్థితి విషమించడంతో శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వాడవాడలా.. గణపయ్యల సందడి

జోన్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం భక్తులు వినాయక మండపాల వద్ద ఉత్సాహంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.





అంబర్‌పేట్ హనుమాన్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలేరు, జనార్దన్, శేఖర్



గణపతి నిమజ్జనానికి తరలివెళ్తున్న జాహ్నవి కళాశాల విద్యార్థినులు



అన్నదానంలో ఎమ్మెల్యే కాలేరు



చిక్కడపల్లిలో గణపతి పూజలో భక్తులు



వేలంలో స్వామివారి కండువాను అందజేస్తూ..



అడిక్‌మెట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎం.బి.కృష్ణ



అడిక్‌మెట్‌లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సూర్యనారాయణశర్మ



లలితానగర్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు



మేడిబావి బస్తీలో డిప్యూటీ మేయర్ దంపతులు



బాగ్ అంబర్‌పేట్‌లో మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి



పటేల్‌నగర్‌లో తులసి మొక్కను అందిస్తున్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు